ఆ రోడ్డు 20 గ్రామాల సమస్య

- గుంతలమయంగా మర్లపాడు నుంచి ఒంగోలు కొండల మధ్య 2 కిలోమీటర్ల రహదారి
- నరకప్రాయంగా ప్రయాణం
- తారురోడ్డు నిర్మిస్తే దూరంతో పాటు తగ్గనున్న ప్రయాణ సమయం

టంగుటూరు: ఓ 2 కిలోమీటర్ల రహదారి 20 గ్రామాల ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోంది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని మర్లపాడు గ్రామంలో బస్టాండ్ నుంచి కొండల మీదుగా ఒంగోలుకు వెళ్లే సుమారు రెండు కిలోమీటర్ల వరకు పంచాయతీరాజ్ పరిధిలోని మట్టిరోడ్డులో రాళ్లు పైకి లేచి గుంతలమయంగా మారింది. ఈ రోడ్డులో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు ప్రయాణం సాగిస్తుంటాయి. అయితే ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఈ రోడ్డు చిన్నపాటి వర్షానికే పూర్తిగా బురద నీళ్లతో నిండి అధ్వారంగా తయారవుతోంది. దీంతో ఈ రోడ్డు గుండా వెళ్లే వాహనచోదకులు జారిపడి ప్రమాదాలకు గురవుతున్నారు. నిత్యం ఈ రోడ్డు నుంచే స్కూల్ బస్సులు, ఆర్టీసీ బస్సులు, కార్లు ప్రయాణం సాగిస్తుంటాయి. అంతేకాకుండా మద్రిపూడి జువ్విగుంట, కొండపి, తంగెళ్ల, జాళ్లపాలెం దూర


అధ్వాంగా ఉన్న మర్లపాడు-ఒంగోలు కొండల మధ్య మట్టిరోడ్డు

ప్రాంతాల ప్రజలు తక్కువ సమయంలో ఒంగోలు వెళ్లేందుకు ఈ మార్గం ఎంతో అనువుగా ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో సుమారు రెండు కిలోమీటర్ల మట్టి రోడ్డు ఇలా గుంతలమయం కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ 2 కిలోమీటర్ల రోడ్డును తారు


రోడ్డులో రాళ్లు పైకి లేచిన దృశ్యం

రోడ్డుగా మారితే ఒంగోలుకు, దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు సురక్షితంగా దూరం తగ్గడంతో పాటు తక్కువ సమయం పడుతుందని ప్రయాణికులంటున్నారు. అధికారులు రోడ్డుపై దృష్టి సారించి తారురోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

రాళ్లపాడు ప్రాజెక్టులో విగ్రహాలు వేయొద్దు

లింగసముద్రం: రాళ్లపాడు ప్రాజెక్టులో వినాయక విగ్రహాలను వేయవద్దని ఏఈ చంద్రమౌళి తెలిపారు. ప్రాజెక్టు నుంచి మూడు భారీ మంచి నీటి పథకాలకు తాగునీరు అందిస్తున్న దృష్ట్యా ప్రాజెక్టులో విగ్రహాలు వేస్తే నీరు కలుషితం అవుతుందన్నారు. లింగసముద్రం మండలం, కొండాపురం మండలాల నుంచి వచ్చే వినాయక విగ్రహాలను ప్రాజెక్టులో వేయవద్దని, ప్రాజెక్టు లోపలి భాగంలో వేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రాజెక్టు దిగువ భాగంలో ఉన్న మన్నేరు వాగులో విగ్రహాలను వేయాల్సిందిగా కోరారు.

రేషన్ బియ్యం తినలేకపోతున్నాం..

- ఎమ్మెల్యేకు కేజీబీవీ విద్యార్థినుల మొర


కేజీబీవీ విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉగ్ర

వెలిగండ్ల: రేషన్ బియ్యం తినలేకపోతున్నామని కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థినులు ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డికి మొర పెట్టుకున్నారు. స్థానిక కస్తూరిబా పాఠశాలను ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఆకస్మికంగా పరిశీలించారు. పాఠశాల తరగతి గదులను, వంటశాలలను పరిశీలించారు. వసతుల గురించి, విద్యాభోధన గురించి, విద్యార్థినుల రోల్ వివరాలు, పరీక్ష ఫలితాలు, సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు సమస్యలను ఎమ్మెల్యేకు మొర పెట్టుకున్నారు.

23న మండల సమావేశం

పామూరు: మండల సర్వసభ్య సమావేశం ఈనెల 23వ తేదీ సోమవారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ గంగసాని లక్ష్మి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బొలినేని సురేష్ తెలిపారు. సమావేశానికి జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, కోఆప్షన్ సభ్యుడు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరుకావాలన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని కోరారు.

రూ.4 లక్షలు పలికిన వినాయకుని లడ్డు


లడ్డును తీసుకెళ్తున్న గుండాబత్తిన మాలకొండయ్య దంపతులు

కందుకూరు రూరల్: మండలంలోని విక్కిరాలపేటలో ఏర్పాటు చేసిన వినాయక చేతిలో ఉన్న లడ్డు పాట రూ.4 లక్షలు పలికింది. విశేష పూజలు అందుకున్న గణనాథుడు వద్ద గురువారం లడ్డు వేలం పాట ఏర్పాటు చేశారు. పోటీ పోటీగా పాటలో పాల్గొన్న గుండాబత్తిన మాలకొండయ్య రూ.4 లక్షలు పాడి లడ్డును దక్కించుకున్నాడు. ఉత్సవ కమిటీ, గ్రామస్తులు మాలకొండయ్యను అభినందించి అట్టహాసంగా మేళతాళాలతో ఊరేగింపుగా కుటుంబ సమేతంగా లడ్డును వారికి ఇంటికి చేర్చారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

కనిగిరి రూరల్: పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం అవుతాయని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. సమస్య పరిష్కారం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన పట్టణంలోని 6,8 వార్డుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. శానిటరీ కార్యదర్శి పవన్ కుమార్, విశ్రాంత హెచ్ఎంలు ఓ మాలకొండారెడ్డి, ఎస్కే మస్తాన్‌వలి, ల్యాబ్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఏచూరి మరణంపై సంతాపం

కందుకూరు: సీపీఎం సీనియర్ నాయకుడు సీతారాం ఏచూరి మృతికి సీపీఎం గుడ్లూరు మండల కమిటీ నాయకులు గురువారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. దేశ చరిత్రలో ఏచూరి మరణం ఒక దుర్దినం అని, దోపిడీ చేసే వర్గాన్ని కూల్చివేసి శ్రామిక వర్గ రాజ్యాన్ని స్థాపించడం కోసం సీతారం ఏచూరి జీవితాంతం కృషి చేశారన్నారు. ఆయన మరణం సీపీఎం పార్టీకి, శ్రామిక వర్గానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. సంతాపం ప్రకటించిన వారిలో గుడ్లూరు మండల కమిటీ నాయకులు మద్దిసెట్టి జాలయ్య, కొట్టే వెంకయ్య, జి స్టాలిన్, అంజయ్య, దామా క్రిష్ణయ్య, పాలకీర్తి నాగేశ్వరరావు, ఎస్ విజయలక్ష్మీ, ఎస్ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

కనిగిరి రూరల్: వామపక్ష యోదుడు, రాజకీయవేత్త, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ రాజ్యసభ సభ్యుడు సీతారాం ఏచూరి మృతికి కనిగిరికి చెందిన వామపక్ష నాయకులు సంతాపం తెలిపారు. సీపీఐ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శులు సయ్యద్ యాసీన్, వై రవీంద్రబాబు, సీపీఎం నాయకులు పీసీ కేశవరావు, వెంకటేశ్వర్లు తదితర వామపక్ష నాయకులు వేర్వేరు ప్రకటనల్లో తమ సంతాపాన్ని ప్రకటించారు.

శంకర్‌రెడ్డి మృతి పార్టీకి తీరని లోటు

పామూరు: వైఎస్సార్‌సీపీ నాయకుడు బైరెడ్డి శంకర్ రెడ్డి మృతి పార్టీకి తీరనిలోటని ఎంపీపీ గంగాసాని లక్ష్మి అన్నారు. మండలంలోని వగ్గంపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు బైరెడ్డి శంకర్ రెడ్డి ఇటీవల మండలంలోని గోపాలపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈసందర్భంగా గురువారం మృతుని నివాసానికి వెళ్లిన ఎంపీపీ గంగసాని లక్ష్మి ఆయన కుటుంబసభ్యులకు పరామర్శించి వారికి రూ.20 వేల ఆర్థికసాయం నగదును అందజేశారు. ఎంపీటీసీ రెక్కల అనితా రెడ్డి, రెక్కల వెంకటేశ్వరరెడ్డి, ఎలికా అచ్చయ్య, గం


కుటుంబసభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న ఎంపీపీ గంగాసాని లక్ష్మి

గిరెడ్డి వెంకటరెడ్డి, షేక్.నాయబ్‌రసూల్, మితికాల బాలక్రిష్ణ, నాయకులు పాల్గొన్నారు.

ప్రతి సచివాలయ పరిధిలో వైద్య శిబిరాలు

- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ప్రియంవద

ఉలవపాడు: ప్రతి సచివాలయ పరిధిలో మెడికల్ క్యాంపులు నిర్వహించాలని కందుకూరు డిప్యూటీ డీఎంహెచ్ఓ ప్రియంవద అన్నారు. స్థానిక ఒకటో సచివాలయ పరిధిలో జరుగుతున్న ఫీవర్ సర్వేను ఆమె పరిశీలించారు. జ్వరాల సర్వే, లార్వా సర్వేలను వైద్య సిబ్బంది నిర్వహించాలన్నారు. ఎక్కడ జ్వరాల కేసులు నమోదైతే అక్కడ వైద్యశిబిరాలు ఏర్పాటుచేయాలన్నారు. వర్షాలు పడిన తరువాత వెంటనే నీరు నిల్వ లేకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వరిగచేను సంఘంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. వైద్య సిబ్బంది సక్రమంగా బాధ్యతలు నిర్వహిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా చూడాలన్నారు. వైద్యాధికారి శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.


వరిగచేను సంఘంలో సమస్యలు తెలుసుకుంటున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ ప్రియంవద

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

వెలిగండ్ల: ప్రజల సమస్యలు సత్వరమే పరిష్కరించాలని ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రామన మహాలక్ష్మీ అధ్యక్షతన గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమావేశంలో చర్చించిన అంశాలను వచ్చే సమావేశం లోగా పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ భూమిని కొంతమంది వ్యక్తులు ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని, ఆ భూమి పశువుల మేతకు, గొర్రెలు, మేకల మేతకు ఉపయోగించుకునేందుకు కేటాయించాలన్నారు. జనన, మరణ ధృవీకరణ పత్రాలు, ఇన్‌కం సర్టిఫికెట్లు అందక ప్రజలు తహసీల్దార్ కార్యాలయం ముందు ప్రదక్షణలు చేస్తున్నామని మరపగుంటకు చెందిన గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. జెడ్పీటీసీ గుంటక తిరుపతిరెడ్డి మాట్లాడుతూ వెలిగండ్లలో విలువైన ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రామన తిరుపతిరెడ్డి, ఎంపీడీఓ రామచంద్రయ్య, తహసీల్దార్ సువర్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తప్పక తీసుకోవాలి


పౌష్టికాహారం గురించి అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్


మాట్లాడుతున్న సూపర్‌వైజర్ సుమతి

- సీడీపీఓ అరుణకుమారి

ఉలవపాడు: గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహారం తప్పకుండా తీసుకోవాలని సీడీపీఓ అరుణకుమారి అన్నారు. స్థానిక ప్రాజెక్టు కార్యాలయంలో పోషణ మాసోత్సవాల్లో ఆమె మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు తీసుకునే ఆహారంలో కాంప్లిమెంటరీ ఫుడ్స్ ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏఏ ఆహార పదార్థాలు తినాలో వివరించారు. అన్ని సెంటర్లలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు తెలియచేశారు. స్థానికంగా ఉన్న గర్భిణులకు సీమంతాలు చేశారు.

కందుకూరు రూరల్: పౌష్టికాహారం తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యు.ప్రభావతి సూచించారు. కందుకూరులోని శ్యామీరపాలెంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, తల్లులు అంగన్‌వాడీ కేంద్రంలో అందించే పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఆకుకూరలు, కూరగాయలు బయట మందులతో పండించినవి ఎక్కువగా ఉంటాయన్నారు. ఎలాంటి రసాయనిక మందులు వాడని కూరగాయలు తీసుకోవాలని సూచించారు. పిల్లలకు తల్లిపాలు అమృతంతో సమానమన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఎస్కే. హసీనా, ఎం.సుభాషిని, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కందుకూరు: సరైన పోషకాహారం తీసుకోవడం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ అన్నారు. పట్టణంలోని సాయినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. పౌష్టికాహారమైన ఆకుకూరలు తీసుకుంటే బిడ్డకు పాలు సక్రమంగా అందుతాయని, ఏడు రకాల మాంసకృత్తులు, పండి పదార్థాలు, కొవ్వు పదార్థాలు, పీచు పదార్థాలు, విటమిన్లు, ఖనిజ లవణాలతో పాటు నీరు తగినంత తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు వి.శారద, ఏ అరుణ, సీహెచ్ ఉషారాణి, పి.ఝాన్సీరాణి, కె. అరుణ, కె.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

కనిగిరి రూరల్: పోషక ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తోందని ఐసీడీఎస్ సూపర్ వైజర్ సుమతి అన్నారు. పట్టణంలోని పలు అంగన్‌వాడీ అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. పోషకాహార ఆవశ్యకతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మెప్మా సీఎంఎం రఘు, అంగన్‌వాడీ కార్యకర్తలు బీబీజాన్, రవికుమారి, సుజాత, మల్లేశ్వరి, సత్యవతి, రజిని, విష్ణుప్రియ తదితరులు పాల్గొన్నారు.

పామూరు: పౌష్టికాహారాన్ని వినియోగించడం ద్వారా రక్తహీనతను నివారించవచ్చని డాక్టర్ హరిబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎంపీఎస్. పార్వతి అన్నారు. మండంలంలోని వగ్గంపల్లె జెడ్పీ హెచ్ఎస్, ఎస్టీకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం తిరుపతిరెడ్డి, ఏఎన్ఎం మహాలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ మౌనిక, కార్యకర్తలు పాల్గొన్నారు.


పోషకాహార మాసోత్సవాలు నిర్వహిస్తున్న అధికారులు


గర్భిణులకు సీమంతాలు చేస్తున్న సీడీపీఓ


పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ పార్వతి

వేలానికి నాణ్యమైన బేళ్లను తీసుకురావాలి

టంగుటూరు: పొగాకు రైతులు వేలానికి నాణ్యమైన పొగాకు బేళ్లు తీసుకువచ్చి అధిక ధరలు పొందాలని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పొగాకు వేలం కేంద్రానికి గురువారం టంగుటూరు, జరుగుమల్లి, వావిలేటిపాడు, సాదువారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు 970 బేళ్లను తీసుకురాగా వ్యాపారులు 791 బేళ్లను కొనుగోలు చేసి 179 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.358, కనిష్ట ధర రూ.195 పలికింది. వేలంలో మొత్తం 46 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

కొండపి (సింగరాయకొండ): స్థానిక వేలం కేంద్రంలో గురువారం నిర్వహించిన వేలంలో సరాసరి ధర రూ.317.73గా నమోదైందని వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. వేలానికి చిన్న వెంకన్నపాలెం, వెన్నూరు గ్రామాలకు చెందిన రైతులు వేలానికి 1017 బేళ్లను తీసుకురాగా 902 బేళ్లను కొనుగోలు చేసి వివిధ కారణాలతో 115 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.358, కనిష్ట ధర రూ.190, సరాసరి ధర రూ.317.73గా నమోదైంది. వేలంలో 13 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.


టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న అధికారులు

బోగస్ రోల్ ఉంటే హెచ్‌ఎంలపై చర్యలు

సీఎస్‌పురం(పామూరు): పాఠశాలలో బోగస్‌రోల్ ఉంటే ఆయా పాఠశాలల హెచ్‌ఎంలపై చర్యలు తీసుకుంటామని ఎంఈఓలు జె.ప్రసాదరావు, రాజాల కొండారెడ్డి అన్నారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో గురువారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ పాఠశాలకు హాజరయ్యే విద్యార్థుల పేర్లుమాత్రమే రిజిస్టర్‌లో, ఆన్‌లైన్‌లో ఉండాలని, ఇతర ప్రాంతాల్లో ఉంటూ ఇక్కడ వారిపేర్లు నమోదుచేసి ఉంటే సహించేది లేదన్నారు. మండలంలో నూరుశాతం విద్యాకిట్‌ల పంపిణీ పూర్తయిందని, ఎవరైనా కొత్తగా పాఠశాలలో చేరి వారికి విద్యాకిట్‌లు రాకుంటే ఒక్కరోజులోనే అందజేస్తామన్నారు. ప్రతి పాఠశాలను పలుమార్లు తనిఖీ చేస్తామని, రికార్డులు ఎప్పటికప్పుడు పూర్తిస్థాయిలో పూర్తిచేసి ఉండాలన్నారు. ఉపాధ్యాయులు నూరుశాతం ఫలితాలపై దృష్టిసారించాలని సూచించారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ ప్రసాదరావు

కందుకూరు ఆర్టీఓగా టీవీఎన్ లక్ష్మి

కందుకూరు: కందుకూరు ప్రాంతీయ రవాణా శాఖాధికారిగా టీవీఎన్ లక్ష్మి నియమితులయ్యారు. ప్రస్తుతం ఆమె చిలకలూరిపేటలో మోటార్ వాహనాల తనిఖీ అధికారిగా పనిచేస్తూ పదోన్నతిపై కందుకూరు ఆర్టీఓగా నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం ఆమె స్థానిక కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు మోటార్ వాహనాల తనిఖీ అధికారి కార్యాలయంగా ఉన్న కందుకూరును రవాణాశాఖ కార్యాలయాన్ని ప్రాంతీయ రవాణశాఖ కార్యాలయంగా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఈ మేరకు మొదటి ఆర్టీఓ టీవీఎన్ లక్ష్మిని నియమించారు. ఆర్టీఓగా బాధ్యతలు చేపట్టిన అనంతరం సబ్‌కలెక్టర్ తిరుమణి శ్రీపూజను ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు.


ఆర్టీఓగా నియమితులైన టీవీఎన్ లక్ష్మి

14న జాతీయ లోక్ అదాలత్

కనిగిరి రూరల్: జాతీయ లోక్ అదాలత్ ఈనెల 14న కనిగిరి కోర్టు ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు కనిగిరి కోర్టు న్యాయమూర్తి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ కె.భరత్‌చంద్ర తెలిపారు. పోలీసులు రాజీ పడదగ్గ కేసుల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను కక్షిదారులకు వివరించి, ఎక్కువ కేసులు రాజీ చేసేందుకు కృషి చేయాలన్నారు. లోక్ అదాలత్‌లో కేసు రాజీ అయితే ఇరుపక్షాలకు గెలుపే ఉంటుందని తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బెల్టుషాపులు ఎత్తేయాలని మహిళల ధర్నా

కనిగిరి రూరల్: గ్రామాల్లోని బెల్టు షాపులు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ గురువారం మండలంలోని నందనమారెళ్ల సెంటర్‌లో మహిళలు రోడ్డెక్కి ఆందోళనకు దిగారు. అధికారులు తక్షణం చర్యలు తీసుకుని బెల్టుషాపులను ఎత్తి వేయాలని డిమాండ్ చేస్తూ రోడ్డుకు అడ్డంగా టైర్లు వేసి బైఠాయించి నిరసనకు దిగారు. దీంతో ట్రాఫిక్ అరగంటకు పైగా నిలిచింది. విషయం తెలుసుకున్న ఎస్సై టి.త్యాగరాజు సంఘటనా స్థలానికి చేరుకొని వారితో మాట్లాడారు. బెల్టు షాపులు తొలగిస్తామని ఎస్సై హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ముగ్గురు జూదరుల అరెస్టు

కనిగిరి రూరల్: స్థానిక పొదిలి రోడ్డులోని లారీ ఆఫీసు ప్రాంతంలో పేకాట శిబిరంపై ఎస్సై టి. త్యాగరాజు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. దాడిలో ముగ్గురిని పట్టుకుని వారి వద్ద నుంచి రూ.6,050 నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

యువత క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలి

సీఎస్‌పురం(పామూరు): యువత విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎస్సై బి.ప్రేమ్ కుమార్ అన్నారు. స్థానిక పామూరురోడ్డులో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వంగవీటి మోహనరంగా యూత్‌ఫోర్స్ ఆధ్వర్యంలో ప్రకాశం, నెల్లూరు రెండు జిల్లాల స్థాయి కబడ్డీ పోటీలను ఎస్సై బి.ప్రేమ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత విద్యకే అధిక ప్రాధాన్యం ఇస్తోందని, క్రీడలకూ ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యాన్ని పెంపొందిస్తాయన్నారు. సంగిశెట్టి శ్రీనివాసులు, సురేష్, రవితేజ, వరలక్ష్మయ్య, పీరయ్యనాయుడు, తోటా పవన్, సంగిశెట్టి రాజా, పెరుగు రమేష్, బోయళ్ల ఆదినారాయణరెడ్డి, శ్రీనివాసులు, క్రీడాకారులు పాల్గొన్నారు.


కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్సై ప్రేమ్‌కుమార్

భక్తిశ్రద్ధలతో కోటి లలిత సహస్రనామ పారాయణ

పామూరు: పామూరు వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో గురువారం కోటి లలిత సహస్రనామ పారాయణ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ, మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు ఏల్చూరి బాలకొండలరావు మాట్లాడుతూ ఉత్తరహళ్లి, తురహళ్లి హోబళి, ప్రత్యంగిరాదేవి ఆలయంలో అమ్మవారికి సమర్పణకోసం ఏకకాలంలో అన్ని ప్రాంతాల్లో కోటి లలిత సహస్ర పారాయణ నిర్వహించినట్లు తెలిపారు. ముందుగా ఆలయంలో వాసవీమాత మూల విగ్రహమూర్తికి అర్చకులు రాయప్రోలు తులసీనాథ్, రాఘవ సుమంత్‌లు ప్రత్యేక పూజలు చేశారు.


వాసవీమాత ఆలయంలో లలితా సహస్రనామ పారాయణం

బై బై గణేశా..!

ఉలవపాడు: మండల పరిధిలోని రామాయపట్నం, అలగాయపాలెం, కరేడు తీరాల్లో గురువారం వినాయక నిమజ్జనాలు కోలాహలంగా జరిగాయి. ఐదవరోజు రాత్రి గ్రామంలో ఊరేగింపు నిర్వహించి ఆరవరోజు గురువారం సముద్రంలో నిమజ్జనం చేశారు. వినాయక చవితి పండుగ సందర్భంగా పూజలందుకున్న వినాయకుడు తప్పెట్లు మేళతాళాల మధ్య గ్రామోత్సవం నిర్వహిస్తూ యువకులు హుషారుగా రంగులు చల్లుకుంటూ గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం సముద్రంలో వినాయక నిమజ్జనం చేశారు. అనంతరం భక్తులు సముద్రస్నానమాచరించారు.


ఉలవపాడులో వినాయకుని గ్రామోత్సవం


తీరంలో నిమజ్జన సందడి


విగ్రహాన్ని సముద్రంలో నిమజ్జనం చేస్తున్న భక్తులు

నేడు మాలకొండ హుండీ లెక్కింపు

వలేటివారిపాలెం: మండలంలోని మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి సంబంధించి శుక్రవారం 12 వారాల హుండీ లెక్కింపు చేయనున్నట్లు ఆలయ ఉప కమిషనర్ కేబీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. కొండ మీద ఉన్న కల్యాణ మండపంలో ఉదయం 8:30 గంటల నుంచి లెక్కింపు ప్రారంభిస్తామన్నారు.